క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: పట్టణంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి సీఎం సహాయనిధి చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మంగళ వారం అందజేశారు. రొళ్ల మండలంలోని సోమఘట్టకు చెందిన సుమకు సీఎం సహాయనిధి నుండి రూ.80 వేలు మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే తిప్పేస్వామి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'చెమట చుక్క'కు పురస్కారం

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం పంచాయతీ హాస్పేన్‌పురానికి చెందిన సుధాకర్ రచించిన 'చెమట చుక్క' సంపుటికి గిడుగు జాతీయ పురస్కారం లభించింది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్రాంత జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం



చరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గౌనివారిపల్లి ప్రజలు

గోరంట్ల: 'పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. మరింత అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టాలి' అని వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గౌనివారిపల్లి, శీనప్పపల్లి, కమ్మలవాండ్లపల్లి, చెట్లమొరంపల్లి, భగవంతంపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నాయకులు, విజయసింహారెడ్డి, ఆది, గోవిదంరెడ్డి, వెంకటేష్, జనార్దన, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుబలను ఎస్సీ జాబితాలో కలపాలి



డీటీకి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పరిగి: కురుబ కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ పరిగి తహసీల్దారు కార్యాలయంలో కురుబ కుల సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహకు వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుతం జరుగుతున్న కుల గణన సర్వే ఆధారంగా తమ కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆర్థికాభివృద్ధికి పాటుపడాలన్నారు.

శుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి పార్థసారథి

పరిగి: మండలంలో హిందూపురం సప్తగిరి డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా చేపడుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. ఎర్రగుంట పంచాయతీ పరిధిలోని నేతులపల్లిలో జరిగిన ముగింపు కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలన్న లక్ష్యంతో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలను చేపడుతోందన్నారు. పరిసరాలతో పాటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీ బెస్త నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పురుష ఓటర్లే అత్యధికం

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితా విడుదల
- మూడు నియోజకవర్గాల్లో 3,47,304 మంది పురుషులు, 3,43,432 మంది మహిళా ఓటర్లు



హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాలకు సంబంధించి విడుదలైన తుది ఓటర్ల జాబితాలో ఎక్కువ శాతం పురుష ఓటర్లే ఉన్నారు. 3,47,304 మంది పురుష ఓటర్లు ఉండగా... 3,43,432 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

మడకశిర: మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా విడుదలైంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,11,074 ఉండగా ఇందులో పురుష ఓటర్లు 1,06,242 మంది, మహిళా ఓటర్లు 1,04,831 మంది చొప్పున ఉన్నారు. మడకశిర రూరల్ మండలంలో ఒకే ఒక థర్డ్ జెండర్ ఓటు ఉంది. అమరాపురంలో మండలంలో 46,919 ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 23,530, మహిళా ఓటర్లు 23,389 మంది ఉన్నారు. గుడిబండలో 43,160 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 21,809, మహిళా ఓటర్లు 21,351 మంది ఉన్నారు. రొళ్లలో 30,677 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 15,660, మహిళా ఓటర్లు 15,017 మంది ఉన్నారు. అగళి మండలంలో మొత్తం ఓటర్లు 26,682 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 13,463, మహిళా ఓటర్లు 13,219 మంది ఉన్నారు. మడకశిర రూరల్ మండలంలో ఓటర్లు 46,432 మంది ఉండగా పురుష ఓటర్లు 23,357 మంది, మహిళా ఓటర్లు 23,074 మంది, థర్డ్ జెండర్ ఓటు ఒకటి ఉంది. మడకశిర అర్బన్‌లో 17,204 ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 8,423 మంది, మహిళా ఓటర్లు 8,871 మంది ఉన్నారు.

హిందూపురం: హిందూపురం నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. నియోజకవర్గంలో మొత్తం 2,46,002 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,23,752 మంది , మహిళా ఓటర్లు 1,22,232, థర్‌జెండర్స్ ఓటర్లు 18 ఉన్నాయి. హిందూపురం మున్సిపాల్టీలో పురుషులు 63,534 మంది పురుష ఓటర్లు , 62,941 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 13 మంది మొత్తం 1,26,488 మంది ఓటర్లు ఉన్నారు. హిందూపురం మండలంలో పురుష ఓటర్లు 21,251 మంది, మహిళా ఓటర్లు 20,865 మంది, థర్డ్ జెండర్స్ ఇద్దరు మొత్తం 42,118 మంది ఓటర్లు ఉన్నారు. లేపాక్షిలో పురుష ఓటర్లు 17,996 మంది, మహిళా ఓటర్లు 17,571 మంది ఉండగా, థర్డ్ జెండర్ ఒకరితో కలిపి మొత్తం 35,568 మంది ఓటర్లు ఉన్నారు. చిలమత్తూరు మండలంలో పురుష ఓటర్లు 20,971 మంది, మహిళా ఓటర్లు 20,855 మంది ఉండగా థర్డ్ జెండర్స్ ఇద్దరితో కలిపి మొత్తం 41,828 మంది ఓటర్లు ఉన్నారు.

పెనుకొండ: పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,33,682 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. గతంలో 2.23 లక్షల మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 2.33 లక్షలకు చేరుకుంది. నియోజకవర్గంలో పురుష ఓటర్ల 1,17,310 మంది ఉన్నారు. మహిళా ఓటర్ల సంఖ్య 1,16,369, థర్డ్ జెండర్స్ ముగ్గురు ఉన్నారు.

లెక్కలు చూపమంటే దాడులు చేస్తారా?



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: వాల్మీకి కల్యాణ మండపం, ఆలయ నిర్మాణం, ఆదాయానికి సంబంధించి లెక్కలు చూపమంటే తమపై దాడులు చేయిస్తున్నారని వాల్మీకి సంఘం ఆలయ కమిటీ సభ్యులు వాపోయారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి సంఘం కళ్యాణ మండపం, ఆలయాన్ని నిర్మించాలని 50 ఏళ్ల క్రితమే ప్రణాళిక రూపొందించారని, దాతల సహకారంతో నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకులు లక్షల్లో ఉన్నారని, వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే ఆలోచనతో 2008లో అంబికా లక్ష్మీనారాయణను వాల్మీకి సంఘంలోకి అప్పటి యువజన నాయకులు పరిచయం చేసి ఆయనను రాజకీయ నాయకుడిగా ఎదగనిచ్చామన్నారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆయన సమక్షంలోనే వాల్మీకి సంఘ కార్యకలాపాలు నిర్వహించామన్నారు. అయినప్పటికీ ఆయన కల్యాణ మండప నిర్మాణానికి ఆరు సంవత్సరాల సమయం తీసుకున్నారన్నారు. అందులోనూ రూ.50 లక్షల మేర అప్పు, రూ.25 లక్షలు ఎంపీ ల్యాడ్స్ కింద, ఆదాయంలో రూ.25 లక్షల వడ్డీ తీసుకున్నారన్నారు. అయినప్పటికీ నేటికీ ఆలయ నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ప్రస్తుత ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణప్ప నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని 8 నెలల వ్యాధిలోనే ఆలయాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. దీంతో వారికి మంచి గుర్తింపు వస్తుందని దురుద్దేశంతో కొంత మంది వారి మీద లేనిపోని అభాండాలు వేస్తున్నారన్నారు. కళ్యాణమంట నిర్మాణం కోసం వసూలు చేసిన డబ్బులకు సంబంధించి లెక్కలు అడిగిన ప్రతిసారి దాడులు చేయిస్తున్నారన్నారు. లెక్కలు అడిగినందుకు నూతన కమిటీని తొలగిస్తున్నట్లు అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు వినయ్ కృష్ణ, అధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి బీఎస్ మూర్తి, విజయ్ కుమార్, కాలవ రాము, చెన్నప్ప, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, చంద్ర, వెంకటేష్, హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అంగన్‌వాడీల హర్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

హిందూపురం: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అంగన్‌వాడీలు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా నాయకులు సాంబశివ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు శోభ, లావణ్య విలేకరులతో మాట్లాడారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు విజయోత్సవ సంబరాలను జరుపుకుని కేక్‌ను కట్ చేశారు.

పరిగి: ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తామంతా సంతృప్తిగా ఉన్నామని అంగన్‌వాడీ ఉద్యోగులు తెలిపారు. పరిగి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ కళ్యాణ మండపంలో కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి సీఎంకు వినతి

- సానుకూలంగా స్పందించారన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కరానికి సీఎం వైఎస్ జగన్ సానుకులంగా స్పందించారని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక తెలిపారు. మంగళవారం పుట్టపర్తి విమానాశ్రయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దీపికతో పాటు ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి కలిశారు. ముఖ్యంగా పట్టణంలోని జామియా మసీద్ నిర్మాణానికి నిధుల విడుదల, అల్ హిలాల్ పాఠశాల అభివృద్ధితో పాటు ముఖ్యంగా పట్టురైతులు, రీలర్లకు మంజూరు చేయాల్సిన రాయితీ బకాయిలు విడుదల చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో సమస్యలు పరిష్కారమయ్యే చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారన్నారు.

సజావుగా కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

మడకశిర: మడకశిర మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశం సజావుగా సాగింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ. 16.53 కోట్ల బడ్జెట్ అంచనాలకు ఆమోదం తెలిపారు. 2024 -25వ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభపు బడ్జెట్ నిల్వ రూ.7.99 కోట్లుగా చూపించారు. అలాగే మున్సిపాలిటీలోని వివిధ ఆదాయ వనరుల ద్వారా రూ.3.80 కోట్లు వస్తాయని అంచనా వేశారు. దీంతో పాటు ప్రభుత్వం నుంచి రూ.4.73 కోట్ల నిధులు సమకూరుతాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సాధారణ ఖర్చులు రూ.2.96 కోట్లు ఉంటాయని అంచనా వేశారు. అలాగే వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.4.80 కోట్లు అవసరమని పేర్కొన్నారు. మొత్తం ఖర్చులు రూ.7.76 కోట్లు ఉండగా ... మిగులు నిధులు రూ.8.76 కోట్లు ఉంటాయని బడ్జెట్ సమావేశంలో అధికారులు వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంటకలక్ష్మమ్మ, కమిషనర్ ప్రభాకర్‌రావు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు ,అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ



క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాధమ్మ

గుడిబండ: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయికి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఎంపీపీ రాధమ్మ మంగళవారం క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. దేవరహట్టి క్రికెట్ జట్టు, గుడిబండ వాలీబాల్ జట్టుకు, బ్యాడ్మింటన్ టీమ్‌లకు కిట్లను అందజేశారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని ఎంపీడీఓ రామారావు అభినందించారు.

పేదల సంక్షేమమే ఆర్డీటీ ధ్యేయం

అమరాపురం: పేదలకు సంక్షేమ లబ్ధిని చేకూర్చడమే లక్ష్యంగా ఆర్డీటీ పనిచేస్తోందని ఆ సంస్థ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని హాలుకూరులో నూతనంగా నిర్మించిన గృహలను స్పాన్సర్లతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ సిబ్బంది, ఇతర దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం

హిందూపురం టౌన్: పట్టణంలోని స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డును పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు చలపతి జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ యోజన రాష్ట్ర కో కన్వీనర్ బంగారు చంద్ర, అశ్వర్థనారాయణ స్వామీజీ, ఆర్టీసీ జగదీష్, రామాంజినేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష 'ఆరోగ్య సురక్ష '



పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లిలో ఆరోగ్య సురక్ష కార్డులు ప్రదర్శిస్తున్న అధికారులు



అమరాపురం మండలం చిట్నడకులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

సాక్షిబృందం: పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరానికి హాజరైన వారికి వివిధ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కుల గణన వేగవంతం చేయండి

అమరాపురం: మండలంలో కుల గణన సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

రొద్దం: మండల పరిధిలోని చోళేమర్రి, సానిపల్లి గ్రామ పంచాయతీల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నీరుగంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి ఆదర్శ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



ఉపాధ్యాయులతో సమావేశమైన డీవైఈఓ రంగస్వామి

లేపాక్షి: మండలంలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ఎస్ఆర్ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డిప్యూటీ డీఈఓ రంగస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, నాడు–నేడు పనులు, మధ్యాహ్నం భోజనం తదితర వాటిపై ఆయన ఆరా తీశారు. ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ప్రధానోపాధ్యాయులు గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలసిన నాయకులు



సీఎం వైఎస్ జగన్‌ను కలసిన మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని

హిందూపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ఉరవకొండలో వైఎస్ఆర్ ఆసరా నాలువ విడత నిధుల విడుదల కార్యక్రమానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌ను పుట్టపర్తి విమానాశ్రయంలో హిందూపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, చల్లాపల్లి బాబురెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

మున్సిపల్ షెడ్‌లో మంటలు

- రూ.10 లక్షలకు పైగా నష్టం



ఎగిసిపడుతున్న మంటలు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ముక్కిడిపేట నల్లప్ప లేఅవుట్‌లో ఉన్న మున్సిపల్ వేస్ట్ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ఫైర్ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ఆకతాయిలు వేస్ట్‌కు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోందన్నారు. మరోవైపు డిప్యూటీ ఇంజనీర్ బాలసుబ్రహ్మణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.10 లక్షల విలువైన కంప్రెషర్ మిషన్ కాలిపోయినట్లు పేర్కొన్నారు.

చంద్రగిరిలో న్యాయ సేవా సదస్సు

పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో మంగళవారం టింబక్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలకు పొదుపు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, చట్టాలపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టింబక్ట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు ధర్మకర్తల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

లేపాక్షి: ప్రఖ్యాతి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం జరుగుతుందని, అనంతరం సభ్యులు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ చేసుకోండి

గుడిబండ: మండల వ్యాప్తంగా రైతులు రబీలో వేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ వీరనరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ, రాగి, మొక్కజొన్న, మిరప, టమాట పంటలకు ఈ క్రాప్ బుకింగ్ పాటు ఈకేవైసీ కూడా చేయించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకూ 1100 ఎకరాలకు ఈ క్రాప్ బుకింగ్ చేశామన్నారు. ఫిబ్రవరి 15 లోపు ఈకాప్ బుకింగ్ చేసుకోవాలని రైతులను కోరారు.

సెబ్ సీఐగా బంగి శ్రీనివాసులు బాధ్యతలు



చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్ పోస్ట్‌లోని సెబ్‌స్టేషన్‌లో సీఐగా బంగి శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, ఇసుక అక్రమ రవాణ జరగకుండా చర్యలు చేపడతామని శ్రీనివాసులు తెలిపారు.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గస్థాయి పోటీలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తెలిపారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూఖ్‌ఖాన్ చేత కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం తూమకుంట 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ భూపతి తెలిపారు. గోళ్లాపురం, తూమకుంట, సంజీవరాయనపల్లి, సంతేబిదనూరు, రామచంద్రపురం, హనుమేపల్లిలం, కిరికెర, అప్పలకుంట, బసవనపల్లి, జూమాకులపల్లి, కొటిపి, బేవనహళ్లి, ఇస్లాంపురం వాసులకు నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 8 గంటలకు కోనాపురంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పుట్టగూర్లపల్లి, ఎం చెర్లోపల్లి, మోదా, బందార్లపల్లి, ఆనందపాళ్యం, గొరవనహళ్లి, ముల్లమోతుకపల్లి, శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి, బోరెడ్డిపల్లి, పరిగి, చిన్నపల్లి గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నేడు నూతన కార్యవర్గం ఎన్నిక

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హిందూపురం తాలూకా నూతన కార్యవర్గం ఏర్పాటుకు బుధవారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వీబీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఎన్నికలు జరుగుతాయని, అన్ని శాఖల అధికారులు ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా ఎన్నికల అధికారిగా నారాయణరెడ్డి, జిల్లా ట్రెజరర్‌గా అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా రమేష్‌బాబు, జిల్లా అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఎన్నికల అబ్జర్వర్‌గా గోవిందప్పను నియమించామన్నారు.

కేబుల్, స్టాటర్ల అపహరణ



కట్ చేసిన కేబుల్‌ను చూపుతున్న బాధిత రైతు రాజు

గుడిబండ: మండల పరిధిలోని నాగేపల్లి, కరికెర పంచాయతీలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి దొంగలు రైతులకు చెందిన కేబుల్, స్టాటర్లను చోరీ చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న 15 వ్యవసాయ బోరు బావులకు అమర్చిన సుమారు 180 మీటర్లకు పైగా వైర్లను, స్టాటర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ నష్టపోయామని బాధిత రైతులు వాపోయారు. ఇటీవల పలు గ్రామాల్లో చోరీలు అధికమవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని సిద్దగిరి గ్రామ సమీపంలో రైతు ఈశ్వరప్ప వ్యవసాయ బోరుకు అమర్చిన కేబుల్‌ను సోమవారం రాత్రి దొంగలు అపహరించారు. ఐదు రోజుల క్రితం కూడా రైతు కృష్ణారెడ్డి వ్యవసాయ బోరు కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

25 నుంచి చింత ఫలసాయం వేలం

అగళి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో చింత ఫలసాయాన్ని ఈ నెల 25 నుంచి బహిరంగ వేలం వేయనున్నట్లు గ్రామ కార్యదర్శులు రంగనాథ్ , వేణు, అశోక తెలిపారు. ఇరిగేపల్లి, మధూడి గ్రామాల్లోని 25న ఉదయం 9 గంటల నుంచి, రాగేలింగనపల్లిలో మధ్యాహ్నం 1 గంట నుంచి వేలం పాట ఉంటుందన్నారు.